క్లుప్తంగా

24న బ్రాహ్మణ సంఘం కార్తీక వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నేతలు

కర్నూలు (అర్బన్): పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని ఈనెల 24వ తేదీన నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హరిహర క్షేత్రం సంకల్‌బాగ్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, భవాని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సంఘం నాయకులు చల్లా నాగరాజు శర్మ, ఉపాధ్యక్షులు కంచుగడ్డల శ్యామసుందర్ రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్ రావు, కోశాధికారి సీఎస్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల వనభోజనాలకు ఏర్పాట్లు



కరపత్రాలను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘాల నాయకులు

కర్నూలు (అర్బన్): వాల్మీకి/బోయల కార్తీక మాస వనభోజన కార్యక్రమాలను ఈనెల 24న స్థానిక బళ్లారి రోడ్డులోని సెయింట్ క్లారెట్ స్కూల్ పక్కన ఉన్న వెంకటనాయుడు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వాల్మీకి సంఘాల నాయకులు తలారి కృష్ణనాయుడు, బేతం కృష్ణుడు, మహర్షి రమణ, మండ్ల శేఖర్ పాల్గొన్నారు.


దోమలను నియంత్రించాలి



తొట్టెలో నీటిని పరిశీలిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): దోమలు పెరగకుండా ప్రతిఒక్కరూ చర్యలు చేపట్టాని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెంచునగర్ ఇందిరమ్మ కట్టలో జరుగుతున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీధుల్లో పర్యటించి పరిసరాలు, పాత్రల్లో నీటి నిల్వలు పరిశీలించారు. ఇళ్ల వద్ద తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉండటాన్ని గమనించారు. ఇంటి పరిసరాల్లోని పాత వస్తువులు, పూలకుండీలు, టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. డ్రమ్ములను వారానికోసారి పూర్తిగా ఖాళీచేసి కడిగి ఎండలో ఆరబెట్టి తర్వాత నీటిని నింపుకోవాలన్నారు. ఇంట్లో నీటిని నిల్వ చేసే పాత్రలపై మూత పెట్టాలని, ఆహారం తినేముందు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు వెంట ఉన్నారు.

సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులర్ చేయాలి



డీఈఓ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

కర్నూలు సిటీ: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో పది పరీక్షల విషయంలో జరిగిన ఘటనలో టీచర్ల సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులర్ చేయాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా చైర్మన్ ఎస్.గోకారి మాట్లాడుతూ.. కోర్టు ఉత్తర్వుల మేరకు సంబంధిత టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అలాగే డీఈఓ ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీలు, మెడికల్ బిల్లుల విచారణలను వేగవంతం చేయా లని కోరారు. ఫ్యాప్టో సభ్యులు శివయ్య, శ్రీనివాసులు, రంగన్న, మౌలాలి, జనార్దన్, భాస్క ర్, నవీన్ పాటి, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్‌లైన్ల మరమ్మతులు, కొత్తలైన్ల ఏర్పాటు పనుల కారణంగా నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. క్యాంపు, ఓల్డ్‌టౌన్, ఎస్టేట్ సెక్షన్ల పరిధిలోని కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



కేసీ కెనాల్‌లో దీపాలు వదులుతున్న మహిళలు



వినాయక ఘాట్‌లో శివలింగానికి దీపారాధన



వెన్నెల వెలుగులో కేసీ కెనాల్‌లో కార్తీక దీపారాధనోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత, జేసీ నవ్య, కేడీసీసీ మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి తదితరులు

దీపం.. దివ్య తేజం

- వైభవంగా కార్తీక లక్ష దీపోత్సవం
- వినాయక్ ఘాట్‌కు పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తుంగా హారతి, జ్వాలా తోరణం

కర్నూలు కల్చరల్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి వినాయక ఘాట్‌లో నిర్వహించిన కార్తీక లక్ష దీపోత్సవ వేడుక కనులపండువగా సాగింది. శివకేశవులకు ప్రీతి పాత్రమైన ఈ మాసంలో కార్తీక పౌర్ణమి అత్యంత పవిత్రం కావడంతో వేలాది మంది భక్తులు కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు చేరుకొని భక్తి పారవశ్యంతో దీపాలను వెలిగించి కెనాల్‌లో వదలి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వేడుక జరిగింది.

సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి నుంచి వినాయక ఘాట్ వరకు శివపార్వతులను రథంపై ఊరేగించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, నగర మేయర్ బీవై రామయ్య, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి కార్తీక దీపోత్సవ సమితి గౌరవాధ్యక్షులు టీజీ రాజ్యలక్ష్మి, కార్యాధ్యక్షులు ఇ.పద్మావతి, సభ్యులు జ్యోతి ప్రజ్వలన, ఆకాశ దీప ప్రజ్వలనతో దీపోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన వేదికపై శివ పార్వతులకు అభిషేకం చేశారు. వేద పండితులు నాగఫణిశాస్త్రి బృందంచే శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన తుంగా హారతి, జ్వాలా తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అశేషంగా పాల్గొని తన్మయత్వం పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. పవిత్ర కార్తీక మాసంలో భక్తులు సామూహికంగా దీపోత్సవం నిర్వహించుకోవడంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. మహిళలు సామూహికంగా కార్తీక దీపాలను గంగమ్మ ఒడిలోకి వదలడం వల్ల నూతనోత్తేజం కలుగుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కల్కి సేవా సమితి వారు ఉచితంగా దీపదానం చేశారు. మాంటిస్సోరి విద్యా సంస్థల వారు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఎస్పీ బిందుమాధవ్, ఎమ్మెల్యే గౌరు చరిత మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి, కల్కి దాసాజీ, సమితి కార్యదర్శులు రాధిక, స్వప్న సారథి, వరలక్ష్మి, సమన్వయ కార్యదర్శి వై.వి.ఉమ, సహకార్యదర్శులు రజని కల్యూర, మహాలక్ష్మి, జయలక్ష్మి, కోశాధికారి అనిత, సభ్యులు పాల్గొన్నారు.



కార్తీక లక్షదీపోత్సవం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిన వినాయక ఘాట్



శివపార్వతుల వేషధారణలో నృత్యప్రదర్శన

భక్తి పారవశ్యం



సూర్యనారాయణ స్వామి ఆలయంలో గౌరీ శంకరుడు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం శైవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. తెల్లవారు జామున, సాయంత్రం సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తీక స్నానాలను ఆచరించి ఆలయాలను సందర్శించి కార్తీక దీపాలను వెలిగించి ఆకాశ దీప దర్శనం చేసుకున్నారు. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చన, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, జ్వాలా తోరణం, శివ పార్వతుల కల్యాణాలు, కార్తీక వన భోజన కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని సప్తగిరి కైలాసగిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్ శివాలయాలు, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్య నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, మాధవ నగర్ శివరామాలయం, అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ ద్వారకా మాయి శివాలయం, శ్రీరామ నగర్, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ భరతమాత దేవాలయం, సంకల్ బాగ్ హరి హర క్షేత్రం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



భరతమాత ఆలయంలో దీపారాధన



లలితా పీఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు



భరతమాత ఆలయంలో జ్వాలా తోరణం

మాజీ సీఎంపై తప్పుడు పోస్టులు పెట్టినవారిని శిక్షించాలి



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సతీమణి భారతమ్మ, వారి పిల్లలపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. అసభ్యకర పోస్టులు పెట్టే వారిని వైఎస్సార్‌సీపీ అధిష్టానం ప్రోత్సహించదని తేల్చి చెప్పారు. శుక్రవారం సి.క్యాంప్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డారు. కూటమి ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల పట్ల, అన్ని వర్గాల ప్రజల పట్ల సమన్యాయం పాటించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా కూటమిలోని కొంతమంది నాయకులు, కార్యకర్తలు అప్పటి ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ మరిచారా అని ప్రశ్నించారు. వ్యక్తిగతంగా ఎవరైనా అసభ్యకర పోస్టులు పెట్టి ఉంటే వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని, అయితే శారీరకంగా చిత్రహింసలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందిన కూటమి ప్రభుత్వం ప్రశ్నించేవారి గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఐదు నెలలకే ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. త్వరలో జరగబోయే జమిలీ ఎన్నికల్లో ప్రజలు కూటమి పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా ఐదేళ్ల పాటు ఇంటింటికీ సంక్షేమాన్ని అందించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఇంటా తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమన్నారు.

జ్ఞాన భారతావనికి ఊపిరి గ్రంథాలయాలు



నాణేల ప్రదర్శనను పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు కల్చరల్: భారతదేశంలో దశాబ్దాల నుంచి ప్రజలకు జ్ఞానోదయం కలిగించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన, నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి సమాచారాన్ని అందించడమే పౌర గ్రంథాలయాల ప్రాథమిక సూత్రమన్నారు. పుస్తకాలు గొప్ప జ్ఞానాన్ని ప్రసాదిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. గ్రంథాలయ సిబ్బందిని సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కురాడి చంద్రశేఖర కల్కూర, కార్పొరేటర్ పి.షాషావలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడికతీత పనులు, పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక 30, 40వ వార్డుల పరిధిలోని స్టాంటన్‌పురం, షాజహాన్ నగర్, కొండారెడ్డి నగర్ కాలనీలలో కమిషనర్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. సమస్యల గురించి ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ.. మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించేందుకు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధి, అంకితభావం అవసరమని, రహదారుల శుభ్రత, పూడికతీత పనుల్లో జాప్యం తగదని హెచ్చరించారు. ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గిరిరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజద్ బాషా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై చిన్నచూపు తగదు

కర్నూలు (అర్బన్): ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను జిల్లా ఉన్నతాధికారులు చిన్నచూపు చూడటం తగదని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ, అసోసియేట్ అధ్యక్షులు వై.హేమంత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శుల పట్ల ఇబ్బందికరంగా మాట్లాడటం తగదన్నారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎండీఓలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించి నిరసన తెలపడం జరిగిందన్నారు. కలెక్టర్ మాటల వల్ల పంచాయతీ కార్యదర్శులపై సచివాలయ సిబ్బందికి చులకన భావం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవో 65 పట్ల హర్షం

గ్రామ పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 65 పట్ల ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. సంఘం అసోసియేట్ అధ్యక్షులు వై.హేమంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుస్వామి, సురేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు బుధవారపేటలో దాడులు చేశారు. మట్కా నిర్వహిస్తున్న దూదేకుల హుస్సేన్, తమ్ముడు దూదేకుల సాయి, మీసాల తేజను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.లక్ష నగదు, మట్కా చీటీలతో పాటు 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లపై శుక్రవారం జర్నలిస్టుల సంఘం నాయకులు శుక్రవారం ఎస్పీ బిందు మాధవ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మేనేజర్‌పై ఏఆర్ కానిస్టేబుల్ దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

హాకీ పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): కాకినాడ జిల్లాలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 హాకీ బాలబాలికల రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హాకీ క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, కోచ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ పేరుతో దళిత గిరిజనులకు మోసం

కర్నూలు(సెంట్రల్): దళిత, గిరిజన సబ్‌ప్లాన్ పేరుతో ఆయా వర్గాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసంచేస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా కార్యదర్శి కె.మహేష్ ఆరోపించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో బి.కుమార్ రాజా అధ్యక్షతన డీహెచ్‌పీఎస్ నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్లకు బడ్జెట్‌లో 25 శాతం నిధులను కేటాయించాల్సి ఉందని, అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్దులో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు 6.28 శాతం, ఎస్టీ సబ్ ప్లాన్‌కు 2.56 శాతం నిధులను మాత్రమే కేటాయించారని విమర్శించారు. డిసెంబర్ 5వ తేదీన జరిగే డీహెచ్‌పీఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రామచంద్ర, కుమార్‌రాజాలతోపాటు మరో 11 మందిని ఆఫీసు బేరర్లుగా, 25మందిని సభ్యులుగా ప్రకటించారు. కార్యక్రమంలో పి.రామకృష్ణారెడ్డి, మునెప్ప పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇసుక సరఫరాపై నిఘా ఉంచాలి

కర్నూలు(సెంట్రల్): ఇసుక సరఫరాపై పటిష్టమైన నిఘా ఉంచాలని మైనింగ్ అండ్ ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి ఇసుక సరఫరాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామాల్లో సొంత ఇంటి పనులకు మాత్రమే బండ్లు, ట్రాక్టర్ల ద్వారా సచివాలయాల పర్యవేక్షకుల సమక్షంలో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చున్నారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లాలోని పరిస్థితులను వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

కర్నూలు (హాస్పిటల్): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద పిల్లలకు తల నుంచి పాదం వరకు స్క్రీనింగ్ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి శనివారం, పాఠశాలల్లో ప్రతి గురు, శనివారాల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్య, స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖల సమన్వయంతో వారంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం అమలవుతుందన్నారు.

18న కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరు కానున్నట్లు చెప్పారు.

యూపీఎస్సీకి ఉచిత కోచింగ్

కర్నూలు (అర్బన్): యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ సూచించారు. డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జిల్లా అభ్యర్థులు అర్హులని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని, సంక్షేమ భవన్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో బస, వసతి కల్పించి శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు స్థానిక బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

19న వరల్డ్ టాయిలెట్ డే

కర్నూలు(సెంట్రల్): ఈనెల 19వ తేదీన వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, పట్టణ ప్రదేశాల్లో శుభ్రంగా ఉంచిన టాయిలెట్లకు అవార్డులు ఇవ్వాలన్నారు. కలెక్టర్లు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించాలని, విద్యార్థులకు పరిశుభ్రతపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈనెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు హ్యూమన్ రైట్స్ డే జరిపించాలని సూచించారు.

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీని కర్నూలులోనే కొనసాగించాలి

కర్నూలు సిటీ: రాష్ట్ర లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మదాసి కురువ సుంకన్న శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే రాష్ట్రస్థాయి కార్యాలయాలు కర్నూలులో ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోర్టును కోరిన మద్దిపాటి శైలజపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చీటి వేసి.. డబ్బులు ఎగొట్టి

కర్నూలు (టౌన్): చీటి వేసింది. డబ్బులు కట్టించుకుంది. అవసరం కోసం చీటి ఎత్తుకున్న మహిళకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది. ఘటనపై బాధితురాలు నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీకి చెందిన బాల సుదేశ్న దేవి అనే మహిళ రాజ్యలక్ష్మి, సందీప్ అనే వ్యక్తుల వద్ద చీటీలు కడుతుంది. చీటి డబ్బులు కట్టించుకున్న వీరు ఆమెకు రూ.1.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎంతకు డబ్బు చెల్లించక పోవడం, ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళనకు గురై శుక్రవారం నాలుగవ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఆక్రమణల గుర్తింపునకు బృందాలు

- కల్లూరులుకు 4, కర్నూలు అర్బన్‌కు 4 టీమ్‌ల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌డీఓ సందీప్ కుమార్

కర్నూలు (టౌన్): హంద్రీ వెంట ఆక్రమణలు, వంకలు, వాగులు ఆక్రమించి నిర్మించిన భవనాలను గుర్తించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇటీవల పెద్ద ఎత్తున ఆక్రమణలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. జొహరాపురం నుంచి పందిపాడు వరకు ఉన్న ప్రాంతాల్లో బఫర్ జోన్‌ను కాదని ఇష్టానుసారంగా నిర్మాణాలు వెలిశాయి. నిబంధనలు అతిక్రమించి హంద్రీని ఆక్రమించేశారు. అడ్డగోలుగా కర్నూలు నగరంలోని దేవనగర్ హంద్రీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వీటన్నింటినీ గుర్తించేందుకు ముందుగా హంద్రీ వెంట బౌండరీలను గుర్తించేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సందీప్‌కుమార్ సర్వే టీమ్‌లను ఏర్పాటు చేశారు. కల్లూరు మండలం పరిధిలో నాలుగు టీమ్‌లు, కర్నూలు అర్బన్ మండలం పరిధిలో నాలుగు టీమ్‌లను నియమించారు. ఈ టీమ్‌లలో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, ఏఈఈ వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్, సచివాలయం ఉద్యోగులను నియమించారు. వీరంతా ఈనెల 30వ తేదీలోపు హంద్రీ వెంట బౌండరీలను గుర్తించి పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.